సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం । 27 । ఆగస్టు । 2025

పచ్చని అరటి పిలకలు ఎంచక్కా స్వాగతిస్తుండగా.. రారమ్మని చెరుకుగడలు తీయగా ఆహ్వానిస్తుండగా... జై గణేషా.. నినాదాలు మార్మోగుతుండగా.. ఆది దేవుడు దివి నుంచి భువిపైకి అడుగుపెట్టాడు.. పళ్లెం నిండా ఉండ్రాళ్లు.. బుట్ట నిండా వెలగపండ్లు కమ్మని ప్రసాదాలకు సిద్ధమవగా.. విఘ్న నాయకుడు మండపాల్లో కొలువుదీరాడు.. వినాయకుడి రాకతో..
పల్లె ముంగిట.. పట్టణమింట.. సందడి నింగినంటింది.
ఊరూవాడా సంబరాల్లో మునిగిపోయింది.
కలతల అలజడులతో... ఆశల శ్వాసలతో..
బతుకుతున్న భక్తకోటి ..
బొజ్జ గణపయ్య ఎదుట ప్రణమిల్లడానికి సిద్ధమైంది.



జై గణేషా!

చవితి వేడుకలకు సర్వం సిద్ధం

- నేడు వినాయక చవితి
- జిల్లాలో 3800 విగ్రహాల ఏర్పాటుకు అనుమతి
- పూజా సామగ్రి కొనుగోళ్లతో కిటకిటలాడిన మార్కెట్లు



విగ్రహాలను విక్రయ కేంద్రాల నుంచి మండపాలకు తరలిస్తున్న ఉత్సవ కమిటీల సభ్యులు



మదనపల్లెలో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు



మదనపల్లెలో మట్టి విగ్రహాలు పంపిణీకి సిద్ధం చేసిన ముస్లిం నాయకుడు పఠాన్ ఖాదర్‌ఖాన్

రాయచోటి : వినాయక చవితిని పురస్కరించుకుని మంగళవారం ఉదయం 9 గంటల నుంచే సందడి నెలకొంది. రోడ్లన్నీ గణపతిని తీసుకు వెళ్లే లారీలు, ట్రాక్టర్లు, ఉత్సాహం ఉరకలేస్తున్న యువకుల కేకలతో మార్మోగాయి. విగ్రహాలను విక్రయించే షెడ్ల వద్ద భక్తుల హడావుడి కనిపించింది. ఉత్సాహ వంతులైన యువకులు డబ్బుకు వెనుకాడక నచ్చిన విగ్రహాన్ని తీసుకెళ్లారు. పండుగనాడు ఉదయం శాస్త్రోక్తంగా విగ్రహానికి ప్రాణ ప్రతిష్ట చేయించేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు.

ఏర్పాట్లు పూర్తి

అన్నమయ్య జిల్లాలో వినాయక చవితి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం నుంచి జిల్లా వ్యాప్తంగా తొమ్మిది రోజుల పాటు వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోనున్నారు. ఉత్సవాల నిర్వహణకు అవసరమైన సరుకులు, పూలు, పండ్లు, పత్రి, చెరుకు గడలు, మొక్కజొన్న కంకులు కొనుగోలు చేసేందుకు తరలివచ్చిన జనంతో జిల్లా పరిధిలోని రాయచోటి, మదనపల్లి, రాజంపేట, పీలేరు, కోడూర్, కొత్తకోట కేంద్రాలలోని మార్కెట్ ఆవరణాలు కిక్కిరిసిపోయాయి. ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన విగ్రహాల విక్రయ కేంద్రాలు కొనుగోలు దారులతో రద్దీగా మారాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి ఉత్సవ కమిటీల నిర్వాహకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలు కోలాహలంగా మారాయి. యువకులు ఉత్సాహంతో విగ్రహాల ఏర్పాట్లపై దృష్టి సారించారు. గత కొన్ని రోజులుగా ఉత్సవ కమిటీలుగా ఏర్పడి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. తెలుగుదనం ఉట్టిపడేలా సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా వేడుకలను నిర్వహించేలా ఏర్పాట్లు పూర్తి చేశారు.

చూడముచ్చటగా మండపాలు

వినాయక మండపాలను నిర్వాహకులు రంగురంగుల అలంకరణలు, విద్యుత్ దీపాల వెలుగులలో చూడముచ్చటైన నిర్మాణాలతో సెట్టింగులను వేసి సిద్ధం చేశారు. జిల్లా కేంద్రమైన రాయచోటి, మదనపల్లి, రాజంపేటతోపాటు జిల్లాలోని 30 మండలాల్లో వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లను అంగరంగ వైభవంగా పూర్తి చేశారు. మండపాలను అన్ని హంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మంగళవారం సాయంత్రం కల్లా వినాయక విగ్రహాలను పలు ప్రాంతాల నుంచి మండపాలకు చేరవేశారు. ఒకరికంటే ఒకరు భారీ విగ్రహాలు, వివిధ రూపాలతో ఉన్న గణనాథుని విగ్రహాలను నెలకొల్పేందుకు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. పలు మండపాల నిర్వాహకులు లక్కీడ్రా ద్వారా ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు, ఎల్ఈడీ టీవీలు తదితర ఆకర్షణీయమైన బహుమతులతో లక్కీడ్రాలను చేపడుతున్నారు.

మట్టి విగ్రహాలు ఉచితంగా పంపిణీ

అన్నమయ్య జిల్లా పరిధిలోని ఆరు నియోజకవర్గాల కేంద్రాలతోపాటు పల్లె ప్రాంతాల్లో సైతం ఈ ఏడాది భారీగా గణనాథుని ఉత్సవాల నిర్వహణకు ప్రజలు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో అన్నమయ్య జిల్లాలోని 30 మండలాల పరిధిలో 3800 విగ్రహాల ఏర్పాటుకు జిల్లా పోలీసు యంత్రాంగం అనుమతులు ఇచ్చింది. జిల్లా పోలీస్ అధికారుల సూచనలు మేరకు విగ్రహాల ఏర్పాట్లు చేస్తున్నారు. వీటితోపాటు గడప గడపన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పూజలు చేసేందుకు సిద్ధమయ్యారు. జిల్లాలోని ప్రభుత్వ శాఖలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు.

ప్రత్యేక నిఘా

చవితి వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా పోలీసులు ఆయా మండపాల వద్ద బందోబస్తు చేపట్టనున్నారు. నవరాత్రులు పూజలందుకున్న అనంతరం వినాయక నిమజ్జనాలను చేపట్టనున్నారు.

వెల్లివిరిసిన మత సామరస్యం

- ఉచితంగా మట్టి విగ్రహాలు పంపిణీ చేసిన ముస్లిం నాయకులు

మదనపల్లె : వినాయక చవితి వేడుకల్లో మత సామరస్యం వెల్లివిరిసింది. కొందరు ముస్లింలు లంబోదరుడిపై భక్తితో.. ఉత్సవాల్లో పాలుపంచుకోవడం విశేషం. 11 ఏళ్లుగా మట్టి విగ్రహాలు ఉచితంగా అందిస్తున్న మదనపల్లెకు చెందిన హజ్ కమిటీ డైరెక్టర్ పఠాన్ ఖాదర్‌ఖాన్ 12వ ఏడాది కొనసాగించారు. మంగళవారం మదనపల్లెలోని తాజ్ హోటల్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఖాదర్‌ఖాన్ 1,000 మందికి విగ్రహాలు పంపిణీ చేశారు. పూజకు అవసరమైన సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఖాదర్‌ఖాన్ మాట్లాడుతూ మదనపల్లె పట్టణంలో ఏ పండుగ జరిగినా కుల మతాలకు అతీతంగా అందరూ జరుపుకొంటూ.. మతసామరస్యానికి ప్రతీకగా నిలవాన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏటా చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి స్థానిక నేతలు, సంఘాల ప్రతినిధులు హాజరై ఖాదర్‌ఖాన్‌ను ప్రశంసించారు.

- మదనపల్లెలో హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్ మట్టి వినాయకుని విగ్రహాలు, మొక్కలు పంపిణీ చేశారు.

న్యూస్‌రీల్

మట్టి విగ్రహం.. పర్యావరణ హితం



విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి : పర్యావరణ హితం ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. కావున అందరూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించాలని పేర్కొన్నారు. జిల్లా కాలుష్య నియంత్రణ మండలి, రాయచోటి పుర పాలక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాయచోటి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్ సుధా, రాయచోటి తహసీల్దార్ నరసింహ కుమార్, మున్సిపల్ కమిషనర్ జి.రవి, ఏఈఈ అనీల్‌కుమార్‌రెడ్డి, అనాలసిస్ట్ సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతియుతంగా జరుపుకోవాలి



ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : వినాయక చవితి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో, శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు తెలిపారు. ఆయన మంగళవారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతిష్ట వేడుకలు, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సంతోషకర వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా వీరభద్రస్వామి జయంత్యుత్సవం



యాళివాహనంపై వీరభద్రస్వామి ఊరేగింపు

రాయచోటి టౌన్ : రాయచోటిలో శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారి జయంత్యుత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం స్వామివారి జయంతి సందర్భంగా మూలవిరాట్‌కు ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. రంగు రంగుల పూలతో అందంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి యాళివాహనంపై కొలువు దీర్చి, పుర వీధుల్లో ఊరేగించారు.

పంచముఖ గణపతిం భజేహం

- రాజంపేటలో అరుదైన ఆలయం

రాజంపేట టౌన్ : రాజంపేట మండలం ఇసుకపల్లె రోడ్డులోని రాజీవ్ స్వగృహ ప్రాంతంలో నిర్మితమైన పంచముఖ విఘ్నగణపతి ఆలయం.. అనతికాలంలోనే ఎంతో విశిష్టత సంతరించుకుంది. సాధారణంగా వినాయక స్వామి ఆలయాల్లో వక్రతొండంతో ఉన్న విగ్రహాలను భక్తులు కొలువుదీరుస్తారు. అయితే రాజీవ్ స్వగృహ ప్రాంతంలో ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీన ప్రారంభించిన వినాయక స్వామి ఆలయంలో.. పంచముఖ విఘ్నపతిని కొలువుదీర్చారు. చుట్టూ చుట్టుకున్న ఆదిశేషుడిపై.. ఈ గణనాథుడు ఆశీనులై ఉండటం మరో ప్రత్యేకతగా చెప్పవచ్చు. ఇదిలా వుంటే ఆదిశేషుడిపై ఆశీనులయ్యే అర్హత ఒక విష్ణువుకు మాత్రమే ఉంటుంది. అయితే అక్కడి పంచముఖ విఘ్నగణపతి ఆలయంలో వినాయకుడు తన అంకం (తొడ)పై లక్ష్మీదేవిని కూర్చోపెట్టుకొని ఆదిశేషుడుపై ఆశీనులు కావడం వల్ల స్వామివారు పంచముఖ విఘ్నగణపతిగా ప్రసిద్ధి చెందారు. పంచముఖ వినాయక స్వామి ఆలయం దేశంలో తొలుత మహారాష్ట్రాలోని షిర్డీ క్షేత్రంలో వెలసింది. రాజంపేట మండలంలోని రాజీవ్ స్వగృహ ప్రాంతంలో వెలసిన పంచముఖ విఘ్నగణపతి ఆలయం రెండవది కావడం విశేషం.

మూలవిరాట్‌కు మరో ప్రత్యేకత

రాజీవ్ స్వగృహ సమీపంలో వెలసిన పంచముఖ విఘ్నగణపతి ఆలయంలోని మూలవిరాట్‌ను శ్రేష్ఠమైన కృష్ణశిలతో రూపొందించారు. అలాగే ఆలయంలో ఉన్న నవగ్రహాలకు కూడా ఓ ప్రత్యేకత ఉంది. ఈ నవగ్రహాలు సతీవాహన సమేతంగా కొలువుదీరడం విశేషం. సతీవాహన సమేతంగా కొలువైన నవగ్రహాలు చుట్టు పక్కల ప్రాంతాల్లో ఎక్కడా లేవు. ఈ ఆలయంలో దక్షిణామూర్తి, పంచముఖ ఆంజనేయ స్వామి, గాయత్రీదేవి, శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి దేవదామూర్తులు కూడా కొలువై ఉన్నారు. విగ్రహాలను నిర్వాహకులు మహాబలిపురంలోని శిల్పులతో ప్రత్యేకంగా తయారు చేయించారు. ఆలయాన్ని కూడా మహాబలిపురానికి చెందిన శిల్పులతో నిర్మింప చేయించడం విశేషంగా చెప్పుకోవచ్చు.



పంచముఖ విఘ్నగణపతి మూలవిరాట్

ముగిసిన పవిత్రోత్సవాలు



కుంభ ప్రోక్షణకు పూర్ణ కుంభాన్ని తీసుకువెళ్తున్న వేద పండితులు (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయంలో ఈ నెల 24న ప్రారంభమైన పవిత్రోత్సవాలు మంగళవారం ముగిశాయి. మూడు రోజులుగా యాగశాలలో వేదపండితులు హోమాలు నిర్వహించారు. చివరి రోజు విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, అగ్ని ప్రతిష్ఠ, పవిత్ర దేవతా హోమం, శాంతి హోమం, మహాపూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ, పవిత్ర వితరణ, మహా మంగళహారతి తదితర పూజలు శాస్త్రోక్తంగా చేశారు.

క్లుప్తంగా

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు


గాయపడిన కోట ఆచారి

కలకడ : లారీ ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై కలకడలో జరిగింది. ఎస్ఐ బి.రామాంజనేయులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కలకడ మండలం గుడిబండ పంచాయతీ గొల్లపల్లెకు చెందిన కోట ఆచారి కలకడ వారపు సంతలో కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చి రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన కోట ఆచారిని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో నిరసన


నిరసన తెలుపుతున్న నేతలు

రాజంపేట : గత ఏడాది సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రాజంపేటలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహించిన బహిరంగసభ ప్రాంతంలో జిల్లా సాధన సమితి నేతలు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సాధన సమితి జేఏసీ నేతలు మాట్లాడుతూ రాజంపేట జిల్లాగా చేయాలనే ప్రతిపాదనలను, ప్రజల మనోగతాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సాధనసమితి జేఏసీ నేతలు పూల భాస్కర్, పోకల నాగేశ్వరరావు, షేక్ అస్లీమ్, పోకల ప్రభాకర్, రఘుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విరిగిన ఆర్టీసీ బస్సు ఛాసీ


ఛాసీ బీమ్ విరిగిన ఆర్టీసీ బస్సు

ములకలచెరువు : ములకలచెరువు మండలం గూడుపల్లె నుంచి ములకలచెరువుకు వస్తున్న ఆర్టీసీ బస్సు ఛాసీ బీమ్ పాతములకలచెరువు మలుపు వద్దకు రాగానే విరిగింది. పరిస్థితి గమనించిన డ్రైవర్ బస్సును నిలువరించాడు. బస్సులో సుమారు 20 మంది ప్రయాణికులు ఉన్నారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

రేపు ఆర్ట్స్ కళాశాలలో అంతర్జాతీయ సమావేశం

కడప ఎడ్యుకేషన్ : కడప ప్రభుత్వ పురుషుల కళాశాల జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన సమగ్ర జీవశాస్త్రం, ఔషధ శాస్త్రంలో జరిగే పరిశోధనల గురించి అంతర్జాతీయ సమావేశం నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. ఈ సమావేశానికి దేశ విదేశాల నుంచి శాస్త్రవేత్తలు హాజరవుతారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరొకరికి గాయాలు


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హర్షవర్ధన్


నాయబ్ రసూల్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మహమ్మద్‌రఫీ, ఎస్ఐ సుబ్బరామచంద్ర

సిద్దవటం : మండలంలోని కనుమలోపల్లి గ్రామ సమీపంలోని కామాక్షమ్మ గుడి వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. ఆయన మాట్లాడుతూ బద్వేల్‌కు చెందిన షేక్ నాయబ్‌రసూల్(22), పి.హర్షవర్ధన్ అనే యువకులు కడప నుంచి మంగళవారం సాయంత్రం ద్విచక్రవాహనంలో బద్వేల్‌కు బయలుదేరారు. వారు అతివేగంగా ప్రయాణిస్తూ కంట్రోల్ చేసుకోలేక సిద్దవటం మండలం కనుమలోపల్లి గ్రామ సమీపంలోని కామాక్షమ్మ గుడి వద్ద రోడ్డు పక్కన ఉన్న సూచిక బోర్డును ఢీకొని రోడ్డు పక్క చెట్లలో ఎగిరిపడ్డారు. ఈ ప్రమాదంలో బద్వేల్‌లోని మహబూబ్‌నగర్‌కు చెందిన షేక్ నాయబ్‌రసూల్ తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ వెనక కూర్చున్న బద్వేల్‌లోని మహబూబ్‌నగర్‌కు చెందిన పి.హర్షవర్ధన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇతన్ని వైద్యం కోసం పోలీసులు 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిద్దవటం ఎస్ఐ మహమ్మద్‌రఫీ ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి, నాయబ్‌రసూల్ మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు.

పారిశ్రామికవేత్తల దరఖాస్తులకు అనుమతులు జారీ చేయాలి

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్


పరిశ్రమల ఏర్పాటుపై సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఛామకూరి

రాయచోటి : జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల నుండి అందిన దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులను జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఛాంబర్‌లో కలెక్టర్ అధ్యక్షతన పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సింగిల్ డెస్క్ విధానం కింద గడిచిన త్రైమాసికంలో అందిన దరఖాస్తుల పరిష్కారం, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహానికి రాయితీల మంజూరు అంశాలపై సమీక్షించి పలు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కె.కృష్ణ కిశోర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, పరిశ్రమల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గంజాయి మొక్కలు తొలగింపు

సుండుపల్లె : గంజాయి మొక్కలను పెంపకం చేస్తున్న వ్యక్తిని మంగళవారం అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు. మండల పరిధిలోని మాచిరెడ్డిగారి పల్లె గ్రామ పంచాయతీ ఆరోగ్యపురం బిడికికి చెందిన మూడే సుబ్బరామ నాయక్ తన ఇంటి పరిసరాల్లో గంజాయి మొక్కలను పెంచుతున్నాడన్న విశ్వసనీయ సమాచారంతో తనతో పాటు రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, ఎక్సైజ్ అధికారులతో పాటు మండల రెవెన్యూ అధికారులు వెళ్లి మూడే సుబ్బరామనాయక్ ఇంటి పరిసరాలలో పెంచుకుంటున్న సుమారు 10 గంజాయి మొక్కలను సమూలంగా తొలగించి ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఒంటిమిట్ట చెరువు కబ్జాకు యత్నం..?

- ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు
- చెరువు అధ్యక్షుడికి హద్దులు చూపిన రెవెన్యూ సర్వేయర్

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని ఒంటిమిట్ట చెరువులో రైలు కట్ట ఆనుకుని ఉన్న 1529/1 సర్వే నెంబర్‌లో చెరువు భూమిని కొంత మంది కబ్జా చేసేందుకు చదును చేశారు. దీంతో స్థానికులు ఇరిగేషన్ ఏఈ కిశోర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే రెవెన్యూ అధికారికి చెరువుకు సంబంధించిన భూమి ఎంత వరకు చదును చేశారో సర్వే చేయించమని సూచించారు. స్పందించిన మండల రెవెన్యూ అధికారి దామోదర్ రెడ్డి తమ మండల సర్వేయర్ ప్రియాంక, గ్రామ సర్వేయర్ వెంకట కృష్ణారెడ్డిని చెరువును చదును చేసిన ప్రాంతానికి పంపి సర్వే చేయించారు. ఆ సర్వే నెంబర్‌లో ఉన్న 4 ఎకరాల, 48 సెంట్లు ఆర్ఎస్ఆర్ ప్రకారం ఒంటిమిట్ట చెరువుకు సంబంధించినదని చూపుతుంది. ఆ మొత్తం ఆక్రమించేందుకు చదును చేసినట్లు గుర్తించారు.

ఇరిగేషన్ ఏఈ వివరణ..

ఎవరు చదును చేశారు, ఎందుకు చేశారు అని ఇరిగేషన్ ఏఈని వివరణ కోరగా చదును చేసిన ప్రాంతంలో కొంత భూమి ఇద్దరు వ్యక్తులపై ఉందని, దాంట్లో భాగంగానే వారి భూమిని చదును చేసే క్రమంలో ఒంటిమిట్ట చెరువుకు సంబంధించిన భూమిని కూడా చదును చేశారన్నారు. ఇలా జరిగిందని తెలియగానే ఒంటిమిట్ట చెరువు అధ్యక్షుడు పాటూరి గంగిరెడ్డికి సమాచారం అందించి, సర్వే చేయించి, చెరువు భూమి వరకు హద్దులు చూపించామన్నారు. అంతే తప్ప ఇది కబ్జా చేసేందుకు జరిగిన యత్నం కాదన్నారు. ఎవరైనా చెరువు భూమిని ఆక్రమించాలని చూస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తి అరెస్టు


నిందితుడు చంద్రశేఖర్‌ను సబ్‌జైలుకు తీసుకెళుతున్న పోలీసులు

తంబళ్లపల్లె : ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు...ఆర్టీసీ డ్రైవర్ రామచంద్రారెడ్డి విధి నిర్వహణలో ఉండగా, మండలంలోని పెండేరివారిపల్లెకు చెందిన చంద్రశేఖర్ (48) సోమవారం మధ్యాహ్నం దాడి చేశాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్ఐ మంగళవారం నిందితుడు చంద్రశేఖర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం 14 రోజులు రిమాండ్ విధించడంతో మదనపల్లె సబ్ జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పకడ్బందీగా లింగ నిర్ధారణ నిషేధిత చట్టం అమలు

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి జగదాంబసెంటర్ : గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంలో నిర్దేశించిన అంశాలను పకడ్బందీగా అమలు చేస్తూ లింగ నిర్ధారణ వెల్లడి నిషేధంపై పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో గర్భస్థ పిండ లింగ నిర్ధారణపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిషేధిత చట్టంలోని నిబంధనల మేరకు స్కాన్ సెంటర్లు లేదా డయాగ్నస్టిక్ సెంటర్లు లింగ నిర్ధారణ చేసినట్లయితే కఠినచర్యలు తప్పవన్నారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో ఈ చట్టంపై అవగాహన కోసం ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా పోలీసు అధికారులతో వైద్యులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, డీసీహెచ్ఎస్, డీఎంహెచ్ఓ, శిశు సంక్షేమ శాఖ అధికారి, ఎన్‌జీఓలు, డీఎల్ఏసీ కమిటీ మెంబర్లు, ప్రోగ్రాం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఎంపిక

వేంపల్లె : రాష్ట్ర స్థాయిలో జరిగే యోగా పోటీలకు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఎంపికైనట్లు ఆర్కేవ్యాలీ డైరెక్టర్ కుమార స్వామి గుప్తా తెలిపారు. వేంపల్లెలో యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కడప జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా పోటీల్లో విద్యార్థులు 6 బంగారు, 5 వెండి, 5 రాగి పతకాలతోపాటు 4 మెరిట్ స్థానాలు సాధించడం విశేషమన్నారు.

• మట్టిలో మాణిక్యాలు


యువకులు నవీన్‌కుమార్, విష్ణువర్ధన్

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కమ్మచెరువుకు చెందిన వీరిద్దరూ వరుసకు బావ, బామర్ది. చిన్ననాటి నుంచి కలసి మెలసి చదువుకున్నారు. వీరి విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ స్కూళ్లలోనే సాగింది. ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో ఇద్దరూ ఎస్జీటీలుగా ఎంపికయ్యారు. కమ్మచెరువుకు చెందిన ఎం.వేమనారాయణ, అలివేలమ్మ దంపతుల కుమారుడు నవీన్‌కుమార్ డీఎస్సీ ఫలితాల్లో 84.40 మార్కులు సాధించాడు. ఇదే గ్రామానికి చెందిన టి.గంగులప్ప, ఈశ్వరమ్మ దంపతుల కుమారుడు టి.విష్ణువర్ధన్ డీఎస్సీ ఫలితాల్లో 70.20 మార్కులు సాధించాడు.

సత్తా చాటిన దంపతులు


దంపతులు మధుసూధన్, సునీత

పెద్దతిప్పసముద్రం మండలంలోని పులికల్లు పంచాయతీ బొంతలవారిపల్లికి చెందిన వెంకట్రమణారెడ్డి, సుబ్బమ్మ దంపతుల కుమారుడు బి.మధూకర్‌రెడ్డి గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తనతో పాటు అతని భార్య సునీత డీఎస్సీ పరీక్షలు రాశారు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో మధూకర్‌రెడ్డి 81.37 మార్కులతో జిల్లాలో 9వ ర్యాంకు సాధించి ఇటు మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్‌గా, అటు పీజీటీగా జోన్–4లో 20వ ర్యాంకు సాధించాడు. భార్య సునీత కూడా 74.62 మార్కులతో జిల్లాలోని మహిళా విభాగంలో 16వ ర్యాంకు సాధించి ఇటు సోషియల్ స్కూల్ అసిస్టెంట్‌గా, 81.05 మార్కులతో అటు ఎస్జీటీగా ఎంపికై ంది. ఒకొక్కరు రెండేసి ఉద్యోగాలకు ఎంపికైన దంపతులను బంధువులు, ఆత్మీయులు అభినందించారు.

మెరిసిన గొర్రెల కాపరి కుమారుడు


స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించిన అలకం వెంకటరమణ

కలికిరి : కలికిరి మండలం మర్రికుంటపల్లి గ్రామం అలకం వారిపల్లికి చెందిన అలకం శివయ్య, లక్ష్మీదేవిల కుమారుడు అలకం వెంకటరమణ ఇటీవల విడుదలైన డీఎస్సీ మెరిట్ లిస్ట్‌లో 14వ ర్యాంకు సాధించి ఫిజిక్స్ విభాగంలో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు. తల్లిదండ్రులు గొర్రెలు కాపరులుగా ఉంటూ తనను చదివించారని, వారి ఆశలు వమ్ము కాకుండా కష్టపడటంతో ఉద్యోగం సాధించినట్లు వెంకటరమణ తెలిపారు.

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలి


సమావేశమైన బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు

రాజంపేట : జిల్లా కేంద్రంగా పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటను చేయాలని రాజంపేట బార్ అసోసియేషన్ తీర్మానించింది. మంగళవారం బార్ అధ్యక్షుడు పచ్చా హనుమంతు నాయుడు అధ్యక్షతన రాజంపేట కోర్టు క్లాంపెక్స్‌లోని బార్ ఆఫీసులో న్యాయవాదులు, బార్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది కొండూరు శరత్‌కుమార్‌రాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పచ్చా హనుమంతునాయుడు మాట్లాడుతూ రాజంపేట జిల్లా చేయడానికి అన్ని అర్హతలున్నాయన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజంపేటను జిల్లా చేస్తానని ప్రకటించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జాఫర్‌బాషా, న్యాయవాదులు నాసరుద్దీన్, ఛాయాదేవి, కోసూరు సురేంద్రబాబు, కేఎంఎల్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రయాణికులపై ఆకతాయిల దాడి

మదనపల్లె రూరల్ : రైలు దిగి బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులపై ఆకతాయిలు అకారణంగా దాడికి పాల్పడి గాయపరిచిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున మదనపల్లె మండలంలో జరిగింది. వాల్మీకిపురం మండలం పాతమంచూరుకు చెందిన యువకులు సునీల్ (22), హరీష్ (23), తేజ(19) లు తమ గ్రామంలో వినాయకచవితి సందర్భంగా విగ్రహ నిమజ్జనం రోజుకు బళ్లారి డ్రమ్స్ వారిని మాట్లాడేందుకు అనంతపురం వెళ్లారు. రైలులో తిరుగు ప్రయాణం అయ్యారు. వాల్మీకిపురంలో ఎక్స్‌ప్రెస్ రైలుకు స్టాపింగ్ లేకపోవడంతో తెల్లవారుజామున మదనపల్లె రోడ్ రైల్వేస్టేషన్(సీటీఎం)లో దిగారు. స్వగ్రామం వెళ్లేందుకు బస్సు కోసం రోడ్డుపైకి వచ్చి ఎదురుచూస్తుండగా, అదే సమయంలో అటువైపుగా వచ్చిన కొందరు గుర్తు తెలియని ఆకతాయిలు వారి వద్దకు వచ్చి అకారణంగా గొడవకు దిగారు. వాగ్వాదం జరగడంతో ఆకతాయిలు ముగ్గురు యువకులపై దాడికి పాల్పడ్డారు. గాయపడిన బాధితులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

స్కౌట్ యూనిట్ ఏర్పాటు తప్పనిసరి


మాట్లాడుతున్న డీఈఓ సుబ్రమణ్యం

రాయచోటి : అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్కౌట్ యూనిట్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం సూచించారు. రాయచోటిలోని డైట్ కేంద్రంలో మంగళవారం పీఎంశ్రీ (ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పాఠశాలల ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులు, యూనిట్ లీడర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో ఉన్న 39 పీఎంశ్రీ పాఠశాలల్లో స్కౌట్ కార్యకలాపాల కోసం సమగ్ర శిక్షణ ద్వారా కేటాయించిన రూ.50 వేలను నిబంధనల ప్రకారం ఖర్చు చేయాలని తెలిపారు. విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి స్కౌట్ శిక్షణ దోహదపడుతుందన్నారు. అనంతరం స్కౌట్‌లో శిక్షణ పూర్తి చేసిన యూనిట్ లీడర్లకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఏఎంఓ షఫీవుల్లా, స్కౌట్ మాస్టర్, గైడ్ కెప్టెన్స్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు 'భారతి' విద్యార్థి ఎంపిక


వైశాలిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ కిషోర్ కుమార్

కమలాపురం : రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు డీఏవీ భారతి స్కూల్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థిని పి.వైశాలి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శివ్వం కిషోర్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 24వ తేదీన రాజంపేటలోని ప్రభుత్వ పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న వైశాలి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన వివరించారు. ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు ప్రకాశం జిల్లా చేవూరులో జరిగే రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ సీనియర్ విభాగం పోటీల్లో ఆ విద్యార్థిని పాల్గొంటుందన్నారు. భారతి సిమెంట్స్ సీఎంఓ సాయి రమేష్, హెచ్ఆర్ గోపాల్‌రెడ్డి, ఐఆర్ అండ్ పీఆర్ చీఫ్ భార్గవ్ రెడ్డి, డీఏవీ ప్రాంతీయ అధికారి శేషాద్రి తదితరులు వైశాలితో పాటు పీడీ రామచంద్రను అభినందించారు.

ఉత్సవం.. కారాదు విషాదం

- నేడు ప్రారంభం కానున్న వినాయక చవితి వేడుకలు
- జాగ్రత్తలు పాటిస్తే మేలు • అత్యుత్సాహం వద్దు


ఇలా నిమజ్జనం చేసే సమయంలో పొంచి ఉన్న ప్రమాదం(ఫైల్)

రాజంపేట టౌన్ : జీవితం ఎంతో విలువైనది. అయితే కొంత మంది పండుగలు, ఉత్సవాల సందర్భంగా అత్యుత్సాహాన్ని ప్రదర్శించే క్రమంలో.. ప్రాణాలనే పోగొట్టుకుంటుండటం చాలా బాధాకరం. ముఖ్యంగా వినాయక చవితి వేడుకలు అంటే పిల్లల నుంచి పెద్దల వరకు అందరిలోనూ ఆనందం ఉరకలేస్తుంది. ఆ సమయంలో కొంత మంది వివిధ విన్యాసాలు చేస్తుంటారు. ఇలాంటి కొన్ని సందర్భాల్లో ప్రాణాలను సైతం పోగొట్టుకుంటున్నారు. ప్రతి ఏడాది వినాయక చవితి వేడుకల సందర్భంగా ఏదో ఒకచోట విషాద సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఎలాంటి అపశ్రుతులు లేకుండా వేడుకలు సంతోషంగా ముగియాలంటే జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. బుధవారం నుంచి వినాయక చవితి వేడుకలు ప్రారంభం కానున్నందున పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని చోట్ల ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. చవితి వేడుకల్లో జరుగుతున్న అపశ్రుతులను దృష్టిలో ఉంచుకొని పోలీసు అధికారులు ఇప్పటికే తగు జాగ్రత్తలు తీసుకోవాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. పోలీసు అధికారుల సూచనలను పాటిస్తే వినాయక చవితి వేడుకలు ఆనందదాయకం కాగలవు.

గతంలో జరిగిన సంఘటనలు

రెండేళ్ల క్రితం వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా ఓ వ్యక్తి పాతబస్టాండ్ సర్కిల్‌లో ట్రాక్టర్‌పై నుంచి ఫల్టీకొట్టబోయి అదుపు తప్పి.. తల మధ్యభాగం రోడ్డుకు బలంగా తగిలింది. దీంతో ఆ వ్యక్తి అక్కడే కదలలేని స్థితికి చేరుకొని జీవచ్ఛవంలా కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఓ కార్పొరేట్ హాస్పిటల్‌లో చేర్పించగా తలలోని నరాలు బాగా దెబ్బతినడంతో దాదాపు పది రోజులు చికిత్స పొంది చివరికి మృత్యువాత పడ్డాడు. ఆయన అత్యుత్సాహం ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

■ 2021లో రాజంపేట పట్టణం కృష్ణానగర్‌కు చెందిన జగన్నాథం అనే విద్యార్థి.. వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న సమయంలో నీటమునిగి మృతి చెందాడు. వినాయకుడి ఊరేగింపు ఆలస్యం కావడంతో చీకటి పడింది. చీకటిలో వినాయకుడిని నీళ్లలోకి దించే క్రమంలో.. జగన్నాథం నీళ్లలోకి దిగి ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. ఆయన మృతి తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చింది.

■ గతేడాది తుమ్మల అగ్రహారానికి చెందిన ఓ వ్యక్తి టపాసులున్న కవర్ పట్టుకొని ఉండగా.. టపాసుల అగ్గిరవ్వలు కవర్‌లో పడ్డాయి. దీంతో కవర్‌లో ఉన్న టపాసులన్ని ఒక్కసారిగా పేలడంతో చేతివేళ్లు తెగిపోయి చెయ్యి ఛిద్రమయింది. దీంతో ఆయన డ్రైవర్ వృత్తికి దూరం కావాల్సి వచ్చింది.

ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి

■ వినాయకుడిని కొలువు దీర్చేందుకు మండపాలు కట్టే సమయంలో విద్యుత్ షాక్ కొట్టకుండా తగు ఏర్పాట్లు చేసుకోవాలి.

■ భారీ విగ్రహాలను వాహనాల్లోకి ఎక్కించే, మండపాల్లో కొలువు దీర్చే సమయంలో పిల్లలను దూరంగా ఉంచాలి.

■ మండపాల్లో దీపాలను వెలిగించే సమయంలో డెకరేషన్‌కు సంబంధించిన దుస్తులు, పేపర్‌లు వంటివి దగ్గరలో లేకుండా చూసుకోవాలి.

■ విగ్రహాలను చీకటి పడకముందే నిమజ్జనం చేయాలి.

■ నిమజ్జనం చేసే సమయంలో పెద్దలు మాత్రమే నీటిలో దిగాలి.

■ కర్రసాము వంటివి చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

■ ఊరేగింపు సమయంలో విద్యుత్ తీగలు తగలకుండా చూసుకోవాలి.

ప్రాణాలు వెలకట్టలేనివి



ఈ ప్రపంచంలో ఒక్కసారి పోతే తిరిగి తెచ్చుకోలేనిది ప్రాణం ఒక్కటే. వినాయక చవితి వేడుకల సందర్భంగా ప్రజలు, భక్తులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. – బి.నాగార్జున, అర్బన్ సీఐ.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం


శివకుమార్, రామాంజనేయులు మృతదేహాలు

కొండాపురం : మండల పరిధిలోని లావనూరు సమీపంలో సాయిబాబాగుడి దగ్గర మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రామాంజనేయులు(24), శివకుమార్ (27) దుర్మరణం చెందారు. వీరు బైకుపై వస్తుండగా స్కార్పియో వాహనం ఢీకొన్నట్లు కొండాపురం ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా యల్లనూరు మండలంలోని దుగ్గుపల్లె వద్ద పంప్ హౌస్‌లో నాలుగురోజుల నుంచి అక్కడ పని చేసి తిరిగి కొండాపురానికి బైకుపై వస్తుండగా లావనూరు వద్ద స్కార్పియో వాహనం ఢీ కొంది. రామంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. శివకుమార్‌ను 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతులు అనంతపురం జిల్లా పెనుగొండకు చెందినవారని ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామన్నారు.

బ్రహ్మంసాగర్‌లో పడి మహిళ మృతి

బ్రహ్మంగారిమఠం: మండల పరిధిలోని సోమిరెడ్డిపల్లె పంచాయతీ నరసన్నపల్లి గ్రామానికి చెందిన మడక లక్ష్మీదేవి(39) అనే మహిళ మంగళవారం బ్రహ్మంసాగర్‌లో గల్లంతై మృతి చెందింది. బాధితులు, కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. ఇటీవల లక్ష్మీదేవి కూతురు అకస్మాత్తుగా మృతి చెందింది. అప్పటి నుంచి మానసికంగా బాధపడుతున్న లక్ష్మీదేవి తన కుమారుడు స్వరూప్‌ను వెంటబెట్టుకుని మంగళవారం తెల్లవారుజామున బ్రహ్మంగారి దర్శనం కోసం ఊరి నుంచి వెళ్లింది. ఈ క్రమంలో బ్రహ్మంగారిమఠం సమీపంలోని బ్రహ్మంసాగర్‌లో స్నానం చేస్తుండగా గల్లంతైంది. తన కుమారుడి ద్వారా ఈ విషయం విషయం తెలుసుకున్న గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని లక్ష్మీదేవి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతురాలి భర్త మడక రమణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.